క్లుప్తంగా

వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు కుర్చీలు వితరణ



మంగళగిరి: వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ లలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం మునగాల మల్లేశ్వరరావు అన్నారు. నగర పరిధిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు స్థానిక దాత గంగా భగీరథ సగర సంఘం ప్రధానకార్యదర్శి జూట్రు ఏడుకొండలు 25 కుర్చీలను హెల్త్ సెంటర్ సిబ్బందికి శుక్రవారం అందజేశారు. దాత ఏడుకొండలను అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పందేటి సాంబశివరావు, కలవకొల్లు కోటేశ్వరరావు, గోపి, దుంపల సోములు, తాడిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం: గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఫిరంగిపురం సెక్టారు వైద్యాధికారి పి.ఎస్తేరు రాణి అన్నారు. మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 84 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చలికాలం కావడంతో ఒకమాదిరి వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని చెప్పారు. శరీర శుభ్రతతోపాటు వెచ్చదనంగా ఉండే దుస్తులు ధరించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం సరోజ, ఆశాకార్యకర్తలు, 104 వైద్యసిబ్బంది విజయ్‌కుమార్, సింగరాజు పాల్గొన్నారు.

ఆరు నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

ఫిరంగిపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల ఆరు నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ కార్యదర్శి పి.శ్రీకాంత్ అన్నారు. మార్కెట్ యార్డులో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు దల కలిగిన నాణ్యమైన పత్తి క్వింటాకు రూ.7,200, పొట్టి గింజ పత్తి క్వింటాకు రూ.6,620 చెల్లించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. యార్డు తరుపున పేరేచర్ల సమీపంలోని శ్రీ విజయ వెంకటేశ్వర కాటన్ మిల్స్‌లో కొనుగోలు నిర్వహిస్తామన్నారు. పత్తి అమ్మదలచిన రైతులు జిరాక్సు పత్రాలతో ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకొని టోకెన్ పొందిన తరువాత మిల్లు వద్దకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను రైతులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో యార్డుసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: మంగళగిరి పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని విద్యుత్ ఉపకేంద్రం ఫీడర్ మరమ్మతుల కారణంగా పాత మంగళగిరి, సీతారామ కోవెల, అన్నపూర్ణ థియేటర్, దిగుడు బావి సెంటర్, ఎన్ఆర్ఐ ఎదుట ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

పెదవడ్లపూడిలో...

నగర పరిధిలోని పెదవడ్లపూడి, కొత్తపాలెంలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. కేఎల్‌యూ రోడ్డు విస్తరణ కారణంగా జరుగుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

ఇద్వా నగర్ వాసులకు నష్టపరిహారం ఇవ్వాలి

నెహ్రూనగర్: నగర పరిధిలోని ఇద్వా నగర్ వాసులకు జీవో నంబర్ 95 ప్రకారం నష్ట పరిహారం అందించాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిప్పా బత్తుల గోవింద్ కోరారు. బాధితులతో నగరంపాలెంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్వా నగర్‌లో పేదలు ఉంటున్న స్థలాల్ని 2004లో తొలగించారని, అప్పటి నుంచి న్యాయ పోరాటం చేస్తున్నామని తెలిపారు. బాధితులకు 50 శాతం నష్టపరిహారంతో పాటు, ఐదు సెంట్లు స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డేవిడ్ విలియమ్స్, బేతపూడి భారతి పాల్గొన్నారు

ఆహార ప్యాకెట్‌లు పంపిణీ

తెనాలి అర్బన్: సినీ దర్శకుడు దిలీప్ రాజా ఆధ్వర్యంలో పట్టణంలోని సంచార జాతుల వారికి శుక్రవారం ఆహార ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయినంపూడి రాకేష్, మిలటరీ ప్రసాద్, అనీఫ్ చౌదరి, రాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయండి

- ఓక్ సిటీ వద్ద తాగునీటి సమస్య వెంటనే పరిష్కరించాలి
- పనులు పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే



కాజ పుల్లయ్యనగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

కాజ(మంగళగిరి): నగర పరిధిలోని కాజతోపాటు పుల్లయ్యనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. శుక్రవారం అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే పుల్లయ్య నగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20లక్షలతో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పుల్లయ్యనగర్ వాసులు పలువురు ఎమ్మెల్యే ఆర్కేను కలసి కృతజ్ఞతలు తెలిపారు. పుల్లయ్యనగర్‌లో గతంలో రోడ్డు, డ్రైనేజీ, తాగునీరు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడ్డామని, ఎమ్మెల్యే ఆర్కే కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. అనంతరం ఓక్ సిటి వద్ద తాగునీటి సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించి ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్‌లు మరమ్మతులకు గురయ్యాయని తెలుసుకుని వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, కమిషనర్ యు శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆర్ల బ్రహ్మయ్య, సొసైటీ మాజీ చైర్మన్ పల్నాటి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఆర్ల రామయ్య, కోటిరెడ్డి, మందా విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాజ, ఆత్మకూరుల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్‌కు విద్యుత్ చార్జీల భారం లేకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నెడ్ క్యాప్, కార్పొరేషన్ అధికారులకు సూచించారు. శుక్రవారం నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు, కాజలోని చెరువులకు ఆయా శాఖల అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కార్పొరేషన్‌కు విద్యుత్ చార్జీల భారం ఏడాదికి రూ.40 నుంచి రూ.50 కోట్లు పడుతుందన్నారు. విద్యుత్ చార్జీలు భారం తగ్గించేందుకు కాజ, ఆత్మకూరు చెరువులలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో పాటు పంప్‌హౌస్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరినట్లు తెలిపారు. ఆత్మకూరు, కాజ చెరువులలో సుమారు 18 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి గ్రిడ్‌లకు అనుసంధానం చేసి కార్పొరేషన్ మొత్తానికి విద్యుత్ సరఫరా చేయడం ద్వారా కార్పొరేషన్‌కి ఏడాదికి రూ.40 కోట్లు ఆదాయం ఆదా అవుతుందని తెలిపారు. తద్వారా కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, నెడ్‌క్యాప్ పీడీ కృష్ణారెడ్డి, నగర కమిషనర్ యు శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భరోసా

మేయర్ కావటి



మెడికల్ కిట్లు అందిస్తున్న మేయర్

నెహ్రూనగర్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తోందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని ఆర్. అగ్రహారం ప్రధాన రహదారి వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్ని నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,032 సచివాలయాల పరిధిలో హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి, అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజలకు కావలసిన వైద్య సదుపాయాల్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి నయమయ్యే వరకు తోడుగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి సచివాలయ కార్యదర్శి భాగస్వాములు అవుతారని, వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి రిపోర్టుతో పాటు అవసరమైన మందులతో కిట్లు అందిస్తామని తెలిపారు. అవసరమైతే అందుబాటులోని హాస్పిటల్లో చేర్పి చికిత్స అందిస్తారని, ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, ఎంహెచ్‌వో భాను ప్రకాష్, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి అంతానికి విద్యార్థులు ప్రతిన పూనాలి

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు



మాట్లాడుతున్న కామేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: అవినీతి అంతానికి విద్యార్థులు ప్రతిన పూనాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (సీజీజీబీ) చైర్మన్ టి.కామేశ్వరరావు తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగం–చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో శుక్రవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కామేశ్వరరావు మాట్లాడుతూ సమగ్రత, పారదర్శకత, అవినీతిపై సమరం అనేవి విజిలెన్స్ అవగాహనలో ప్రధాన పాత్ర వహిస్తాయని తెలిపారు. సాంకేతిక మార్గాలు, మాధ్యమాలనూ ఉపయోగిస్తే అవినీతి రక్కసిని రూపుమాపి దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి, ప్రగతికి బాటలు వేసిన వారవుతామని తెలిపారు. కరోనా సమయంలో ఉదారంగా రుణాల్ని ఇవ్వడం ద్వారా సీజీజీబీ అన్నదాతలకు అండగా నిలిచి ఆదుకుందని చెప్పారు. సీజీజీబీ చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ బి.వి.హెచ్. కామేశ్వరశాస్త్రి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.బి.వి. మనోహర్, అధ్యాపకులు శ్రీనివాసరావు, రవికుమార్, నాగనిర్మలారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


- ఇన్‌చార్జ్ కమిషనర్ పి.వి.కె. భాస్కర్
- నేడు, రేపు ఓటర్ ముసాయిదా జాబితాపై క్యాంపెయిన్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భాస్కర్

పాత గుంటూరు: ఓటర్ల ముసాయిదా జాబితాపై ఈ నెల 4,5 తేదీల్లో జరిగే స్పెషల్ క్యాంపెయిన్‌లో బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ బూత్‌లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలని నగర ఇన్‌చార్జ్ కమిషనర్ పి.వి.కె. భాస్కర్ ఆదేశించారు. రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు స్పెషల్ క్యాంపెయిన్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని 532 పోలింగ్ బూత్‌లలో శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి నూతన ఓటుకై దరఖాస్తులు, ఓటర్ కార్డ్‌లో చిరునామా, పేరు, పుట్టిన తేదీ తదితర మార్పులకై దరఖాస్తులు తీసుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులు, అభ్యంతరాల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండే వారి పై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నగరంపాలెం: జీజీహెచ్‌లో సేవలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు అందించడం దృష్ట్యా వైద్యులు, నర్సులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ వై.కిరణ్‌కుమార్ సూచించారు. రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అవగాహన వారోత్సవాల్లో భాగంగా విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శుక్రవారం జీజీహెచ్ శుశృతా హాలులో 'అవినీతికి నో చెప్పండి దేశానికి అంకితంకండి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఈఈ కేవీవీకుమార్ మాట్లాడుతూ ప్రజా ధనం వృథా చేయవద్దని తెలిపారు. అవినీతి రహితంగా, పారదర్శకంగా నాణ్యమైన చికిత్సను రోగులకు అందించాలని ఆయన సూచించారు. అనంతరం సిబ్బందితో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐ ఎ.శ్రీహరిరావు, ఏఈఈ వై.శివన్నారాయణ, వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్, సహాయ జియోలజిస్ట్ ఎస్.ప్రసాద్, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, ఎఫ్ఆర్‌వో షేక్ సైదులు, అసిస్టెంట్ డైరెక్టర్ (పరిపాలన) సీహెచ్.నాగేశ్వరరావు, పలు విభాగాల వైద్యులు, నర్సులు, ఆసుపత్రి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్ ఏడీ సస్పెన్షన్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సస్పెండ్ అయిన నాగేశ్వరరావు స్థానంలో తాత్కాలికంగా గుంటూరు వైద్య కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్‌ను నియమిస్తున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. జీజీహెచ్ ల్యాబ్‌లో పనిచేస్తున్న ఏడుకొండలు ప్రమోషన్‌పై ఆసుపత్రి అధికారులు తాత్సారం చేస్తుండటంతో అతను కోర్టుకు వెళ్లాడు. కోర్టులో ఆసుపత్రి తరపు అధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారులను ప్రతివాదులుగా పేర్కొంటూ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై జీజీహెచ్ అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో విధుల్లో నిర్లక్ష్యం వల్ల జీజీహెచ్ ఏడీని సస్పెండ్ చేస్తున్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు.

జాతీయ స్థాయి ఫైన్ ఆర్ట్స్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఫైన్ ఆర్ట్స్ ఫెస్ట్ పోస్టర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డిసెంబర్ 1, 2 తేదీల్లో ఆల్ ఇండియా ఫైన్ ఆర్ట్స్ ఫెస్ట్–2023 ఏఎన్‌యూలో జరుగుతుందని తెలిపారు. ఫైన్ ఆర్ట్స్ ఫెస్ట్‌కు ఏఎన్‌యూ వేదిక కావడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి, ఫైనాన్స్ విభాగం కో–ఆర్డినేటర్ బి. శేఖర్ బాబు, అధ్యాపకులు డాక్టర్ షకీలా నూర్ బాషా, పి. దేవకాంత్, బి. జాన్ రత్నబాబు, ఫైన్ ఆర్ట్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎల్. వాగ్దేవి, వైస్ ప్రెసిడెంట్ కె రాము, బి. పవన్ కుమార్, కె.వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలి

నగరంపాలెం: తూర్పు నియోజకవర్గ పరిధిలో ఈనెల 4న జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను నగర ప్రజలంతా జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ క్లస్టర్– 3 అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, క్లస్టర్– 4 అధ్యక్షుడు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ కోరారు. బృందావన్ గార్డెన్స్‌లోని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం పార్టీ క్లస్టర్ – 3, 4 ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం జగనన్న పాటుపడుతుండటంతోనే ఏపీలో సామాజిక సాధికారత సాధ్యమైందని చెప్పారు. గత టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ఉపయోగించుకున్నారని ఆరోపించారు. బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన ఘనత వై.ఎస్. జగనన్న ప్రభుత్వానిదేనని తెలిపారు. సమావేశంలో జేసీఎస్ ఇన్‌చార్జి ఇన్నారెడ్డి, నేతలు గోరీపతి శర్మ, జక్కా శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, గిరి పాల్గొన్నారు.

గోమాతను పూజించడం పుణ్య ప్రదం



గుంటూరు ఎడ్యుకేషన్: సకల దేవతామూర్తులు కొలువైన గోమాతను పూజించడం ఎంతో పుణ్యప్రదమని ఆర్యవైశ్య అఫీషియల్స్–ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) జిల్లా అధ్యక్షుడు కె.వి. బ్రహ్మం పేర్కొన్నారు. గుంటూరువారితోటలోని గోశాలలో శుక్రవారం అవోపా ఆధ్వర్యంలో 40వ గోపూజ, గోసేవ కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోవుల్ని శుభ్రం చేసిన సభ్యులు పసుపు, కుంకుమలతో పూజించారు. అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 40 వారాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. గో పంచకాన్ని సేవిస్తే సకల రోగాలు హరిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో 200కు పైగా హాజరైన సభ్యులకు గో సంబంధిత వస్తువులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా జిల్లా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, చామర్తి రమేష్, సాయిరమేష్, జనార్దనరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగిన అండర్ –14,17 బాల బాలికల పోటీలలో ప్రతిభ కనపరచిన పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ రవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అండర్–14 విభాగంలో బి.ఉదయకిరణ్, కె ప్రసన్న కుమారి, అండర్–17 విభాగంలో అఖిల్, ఎ.సంధ్యారాణిలతోపాటు చినకాకాని జెడ్పీ హైస్కూలులో జరిగిన అండర్–14 విభాగంలో కబడ్డీ పోటీలకు కె ఆనంద్, గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగిన అండర్–14 వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం కె వెంకటేశ్వరరావు, పీఎంసీ చైర్మన్ పి రవి బాబు, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్

బీఎస్ఎస్‌బీ విద్యార్థులు ఎంపిక

తాడికొండ: రాష్ట్రస్థాయి అండర్–19 ఖోఖో పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు తాడికొండ బీఎస్ఎస్‌బీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సునీత లక్ష్మీ, ఫిజికల్ డైరెక్టర్ ఎం నాగరాజు తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అక్టోబర్ 30వ తేదీన అమరావతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన ఎంపికలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు అనీల్, నవదీప్ శర్మ, బిక్షాలు, పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో వీరికి జిల్లా జట్టు తరుపున రాష్ట్రస్థాయిలో నిర్వహించే అండర్–19 ఖోఖో పోటీలకు వెళ్లే జట్టులో స్థానం లభించడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాలలో విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి ఉత్తమ శిక్షణ అందించడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్ సునీత లక్ష్మీ, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజుతోపాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

కర్బన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ

వియన్నా కాన్ఫరెన్స్‌లో నగర కమిషనర్ కీర్తి చేకూరి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కర్బన వ్యర్థాల నిర్వహణలో గుంటూరు నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుందని, వ్యర్థాల సేకరణకు ఈ–ఆటోల్ని అందుబాటులోకి తెచ్చామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ది ఇంటర్నేషనల్ వియన్నా ఎనర్జీ అండ్ క్లైమేట్ ఫోరం కాన్ఫరెన్స్‌లో భాగంగా ఆస్ట్రియా రాజధాని వియన్నాలో శుక్రవారం జరిగిన సొల్యూషన్ సెషన్‌లో ఆమె పాల్గొన్నారు. నగరంలో ఘన వ్యర్థాల నిర్వహణలో తీసుకున్న ఆధునిక విధానాల్ని వివరించారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి కర్బన వ్యర్థాల నిర్వహణ ఎంతో కీలకమని, అందుకు గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాల్ని సాంకేతిక విధానం ద్వారా జీరో ల్యాండ్ ఫిల్ దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. డంపింగ్ యార్డుల్లో గతంలో ఉన్న వ్యర్థాల్ని బయో మైనింగ్ విధానం ద్వారా ప్రాసెసింగ్ చేస్తున్నామని పేర్కొన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ వ్యర్థాల నిర్వహణలో తీసుకున్న వినూత్న విధానాలకు జాతీయ స్థాయిలో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో వచ్చిన గుర్తింపును వివరించారు. రానున్న రోజుల్లో నగర ప్రజల సహకారం, భాగస్వామ్యంతో వ్యర్థాల నిర్వహణ మరింత పగడ్బందీగా చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఏర్పాటు చేసిన 500 కిలోవాట్ల ఫ్లోటింగ్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను నగరంలో నూతనంగా అందుబాటులోకి తెచ్చిన ఈ–ఆటోల చార్జింగ్‌కి ఉపయోగిస్తున్నామని తెలిపారు. అనంతరం వియన్నాలోని బయో ఎనర్జీ ప్లాంట్‌ని సందర్శించి, నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తాత్కాలిక లైసెన్సుల కోసం సింగల్ డస్క్

బాణసంచా వ్యాపారులతో సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ



అధికారులు, వ్యాపారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలిరూరల్: దీపావళి సందర్భంగా బాణ సంచా విక్రయ వ్యాపారం చేసేందుకు తాత్కాలిక లైసెన్సులు తీసుకునే వారి కోసం తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. బాణసంచా విక్రయాలపై తన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, హోల్‌సేల్‌వ్యాపారులు, తాత్కాలిక లైసెన్సు పొందే వారితో సబ్‌కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బాణసంచా విక్రయ దుకాణాల ఏర్పాటు, వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని ఇప్పటికే తెలియజేశామని, ఏపీ ప్రభుత్వ శాఖల అనుమతులు కావాల్సి ఉంటుందో ఆయా శాఖల అధికారులతో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెనాలిలో టీజే కళాశాలతో పాటు మరి కొన్ని ప్రాంతాలను పరిశీలించాల్సి ఉందన్నారు. త్వరలో వ్యాపారులు, అధికారులతో కలసి పట్టణంలో పర్యటించి మరికొన్ని అనువైన ప్రాంతాలను ఎంపిక చేస్తామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండ విక్రయ కేంద్రాల సంఖ్యను పెంచుతామని చెప్పారు. డివిజన్‌లో తెనాలితో పాటు మంగళగిరి, తాడేపల్లి, చేబ్రోలు, పొన్నూరులలో స్టాళ్లను ఏర్పాటు చేస్తామని, ఎక్కడా ఇబ్బందులు/విపత్తు తలెత్తకుండ, జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కార్యక్రమంలో తెనాలి తహసీల్దార్ కె.రవిబాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, త్రీటౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, రూరల్ ఎస్ఐ ప్రసన్నకుమార్, టూ టౌన్ ఎస్ఐ నాగేశ్వరరావు, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలను నిలిపివేయండి



ప్లాస్టిక్ వస్తువులను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

తెనాలిఅర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించిందని, విక్రయించిన, ఉపయోగించిన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు హెచ్చరించారు. తెనాలి పట్టణంలోని పలు దుకాణాలలో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ వస్తువులను విక్రయించే పలువురు వ్యాపారులకు అపరాధ రుసుం విధించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారులు, వినియోగదారులు గుడ్డ సంచులు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, శానిటేషన్ సెక్రెటరీ నాగేశ్వరరావు, కె.సురేష్, పి.శాంతకుమారి, కె.శ్రీనాథ్, వై.నాగమల్లేశ్వరరావు, ఎ.ఉమామహేశ్వరరావు, కె.నాగరాజు, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.